## క్లుప్తంగా

### సబ్సిడీ విత్తనాల పంపిణీ



పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్, జెడ్పీటీసీ

మద్దికెర: రబీ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు అందజేస్తోందని సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ మార్కెట్ యార్డు చైర్మన్ పక్కీరప్ప, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి, ఏఓ రవి సూచించారు. సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విత్తనాలు కావలసిన వారు సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ అనిత, సర్పంచ్ సుహాసిని, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఉప సర్పంచ్ ప్రమీలమ్మ, తదితరులు ఉన్నారు.

### ఈ-క్రాప్ నమోదు పరిశీలన

తుగ్గలి: ఈ-క్రాప్‌లో నమోదు చేసిన పంటలను సోమవారం తహసీల్దార్ రవి పలు గ్రామాల్లో క్రాస్ చెక్ చేశారు. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు కలిసి ఈ-క్రాప్ బుకింగ్ చేశారు. ఉన్నతాధికారులు సూచించిన పలు సర్వే నంబర్లలో రైతులు ఏ పంట వేశారు. ఈ క్రాప్ బుకింగ్‌లో ఏ పంట నమోదు చేశారనే దానిపై తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీఆర్వో రహిమాన్, వీఆర్‌ఏ వెంట ఉన్నారు.

### అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నందవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986-87 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం పాఠశాలలో ఘనంగా జరిగింది. ముందుగా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు, నారికేళాలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈరన్న, రాజయ్య, విజయ్ కుమార్, వెంకటరాముడు, శాంతమూర్తి, బసవరాజుగౌడ్, రత్నప్రసాద్, వార్డెన్ ఆనంద్, పురుషోత్తం రెడ్డిని శాలువాలు, పూలమాలలతో పూర్వ విద్యార్థులు సన్మానించారు. పూర్వ విద్యార్థులు వారి అభువాలను, అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.

### వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



తుగ్గలి కేజీబీవీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏపీసీ వేణుగోపాల్

తుగ్గలి: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థినులను తీర్చిదిద్దాలని ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వేణుగోపాల్ సూచించారు. సోమవారం స్థానిక కేజీబీవీని ఆయన తనిఖీ చేశారు. భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినులతో బోధనపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించాలని విద్యార్థినులకు సూచించారు. జీసీడీఓ సునీత, ఎస్ఓ సాలమ్మ పాల్గొన్నారు.

### చెరువులకు నీటి మళ్లింపుతో కరువు దూరం

తుగ్గలి: హంద్రీ-నీవా రిజర్వాయర్ ద్వారా చెరువులకు నీటి మళ్లింపుతో కరువు దూరమవుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ బోగోలు నాగభూషణరెడ్డి, సర్పంచ్ మనీంద్ర అన్నారు. సోమవారం రాంపల్లి వద్ద చెరువులోకి పారుతున్న హంద్రీనీవా నీటిలో కొబ్బరికాయకొట్టి గంగమ్మ పూజ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని పండుగ చేయాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నాడు హంద్రీ-నీవా రిజర్వాయర్ నిర్మించారన్నారు. నేడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని హంద్రీ నీవా నుంచి చెరువులకు నీటిని మళ్లిస్తున్నారన్నారు చెరువులు నిండితే తాగునీటి ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు వేలాది ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందన్నారు. వలసలు పూర్తిగా తగ్గిపోతాయన్నారు. నీటి మళ్లింపుపై సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు.

### తెర్నేకల్‌లో గ్రామసభ

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్‌లో సోమవారం సర్పంచ్ ఎం.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రామమ్మ-ఎల్లమ్మపేటకు తాగునీటి కోసం కొత్త పైపులైన్ నిర్మాణం కోసం ఎంపీపీ నిధుల నుంచి వాడాలని సభలో నిర్ణయించారు. అలాగే 2023-24 సంవత్సరానికి పంచాయతీకి ఎంత మేర పన్నులు వసూలయ్యాయనే విషయంపై చర్చించారు. హెల్త్, ఐసీడీఎస్, వెల్ఫేర్, అగ్రికల్చర్ తదితర శాఖల పనితీరు, వాటి ప్రాధాన్యత గురించి చర్చించారు. పార్టీ నాయకులు లుముంబా, బెల్ ఈరన్న, పంచాయతీ కార్యదర్శి రాముడు పాల్గొన్నారు.

# జాతిపితకు ఘన నివాళి



నందవరం పోలీస్‌స్టేషన్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ తిమ్మయ్య, పోలీసులు



గోనెగండ్లలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు



పోతుగల్లు చెరువులో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



వెల్దుర్తిలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, సర్వేయర్ తదితరులు



ఎమ్మిగనూరులో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు



మద్దికెరలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



పత్తికొండ సబ్‌జైలులో మాట్లాడుతున్న జడ్జి దివ్య



తుగ్గలిలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది



దేవనకొండలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆస్పరిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వాడవాడలా గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు చేపట్టారు. మహాత్ముడు చూపిన మార్గంలో నడవాలని వక్తలు సందేశం ఇచ్చారు.

– ఎమ్మిగనూరు ఎంపీడీఓ కార్యాలయం నుంచి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు గాంధీ చౌక్ వద్దకు ర్యాలీగా వచ్చి మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు బుట్టారంగయ్య, యూకే వీరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

**'జాతిపిత' అడుగుజాడల్లో 'నడుద్దాం'**

పత్తికొండటౌన్: గాంధీ మహాత్ముడు అనుసరించిన అహింసా మార్గంలో నడుద్దాం అని జూనియర్ సివిల్‌జడ్జి వి.దివ్య పిలుపునిచ్చారు. సోమవారం పత్తికొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో గాంధీజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సబ్ జైలులో గాంధీజయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవ వేడుకల్లో జూనియర్ సివిల్ జడ్జి దివ్య పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ.. గాంధీజీ ఆచరించిన సత్యం, అహింస మార్గాలను అందరూ పాటించాలని కోరారు. జైలు సూపరిండెంట్ చంద్రమోహన్, న్యాయవాదులు, జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

కృష్ణగిరి: పోతుగల్లు గ్రామ శివారులోని చెరువులో సర్పంచ్ తెలుగు వాణిశ్రీ, ఎంపీటీసీ సభ్యురాలు బేతాపల్లె రాజేశ్వరి, వాటర్‌షెడ్ అధికారి అహ్మద్‌తో కలిసి గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాంతి, సహనం, సత్ప్రవర్తన, సత్యం, అహింస గాంధీ సిద్ధాంతాలన్నారు. ప్రతిఒక్కరూ ఈ సిద్ధాంతాలను పాటించిన నాడే గాంధీజీకి నిజమైన నివాళి అర్పించిన వారవుతామన్నారు. స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా ఊట కుంట సమీపంలో మొక్కలు నాటారు.

ఆలూరు రూరల్: నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మహాత్మాగాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి ఎంపీడీఓ అల్లబకష్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే ఆలూరు బార్ అండ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్, కార్యదర్శి విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జాతిపిత చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: వెల్దుర్తి, కృష్ణగిరి మండలాలకు చెందిన నలుగురు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయా కుటుంబాలకు మంజూరైన రూ.2 లక్షల చెక్కులను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న వారిలో.. రెండేళ్ల క్రితం కరిడికొండ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బోయ దేవేంద్ర సతీమణి పుసులూరు రమాదేవి, రెన్నెళ్ల క్రితం పట్టణంలో మెట్లపై నుంచి పడి మృతి చెందిన బీసీ బాలికల గురుకులం పేరెంట్స్ కమిటీ చైర్మన్ అనకల గిడ్డయ్య సతీమణి కృష్ణవేణి, రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన సారెడ్డి వెంకటసుబ్బారెడ్డి సతీమణి భాగ్యలక్ష్మి, రెన్నెళ్ల క్రితం కృష్ణగిరి మండలం కంబాలపాడు గురుకులంలో కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకున్న గుండ్లమల్లాపురం గ్రామానికి చెందిన లుధియా తల్లి మాదిగ సువార్త మ్మ ఉన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధితుల కుటుంబాలలో నెలకొన్న విషాదం తీర్చలేనిదని, తమ వంతుగా ఆదుకునేందుకు ముందుంటామన్నారు. ఏ సమస్య వచ్చిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న మాదిగలు ఉన్నారు.

### 4 నుంచి మూడవ దశ రీసర్వే



మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

వెల్దుర్తి: మండల పరిధిలోని నర్సాపురం, సర్పరాజాపురం, బోగోలు, చెరుకులపాడు, మల్లెపల్లె గ్రామ పరిధిలో జగనన్న శాశ్వత భూ హక్కు పథకం కింద మూడవ దవ రీసర్వే ఈనెల 4వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. ఈ మేరకు సోమవారం నర్సాపురం, బోగోలులో గ్రామ సభలు నిర్వహించారు. నర్సాపురం గ్రామ సభలో తహసీల్దార్, మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి మాట్లాడుతూ రీసర్వే సందర్భంగా రైతులు, ప్రజలు తమ భూములకు సంబంధించిన ధ్రువపత్రాలు చూపి సహకరించాలని కోరారు. ప్రతి భూ కమతాన్ని అక్షాంశ, రేఖాంశాల ఆధారంగా మార్క్ చేసి నంబర్ కేటాయిస్తామన్నారు. క్యూఆర్ కోడ్ సైతం ఇస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్టారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సమగ్ర రీసర్వే చేపట్టిందన్నారు. ప్రజలకు ఒక్క పైసా భారం లేకుండా భూములను సర్వే చేసి, హద్దు రాళ్లు పాతి, హక్కు పత్రాలు అందిస్తుందన్నారు. వీఆర్‌ఓ రామకృష్ణ, సెక్రటరీ రహమత్, విలేజ్ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించాలని వినతి

దేవనకొండ: ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యను కర్నూలులో జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆమె సమస్యను కమిషనర్‌కు మెయిల్‌కు పంపి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



ముగతిలో గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నందవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని ముగతి గ్రామ సర్పంచ్ విరుపాక్షిరెడ్డి అన్నారు. సోమవారం ముగతి గ్రామంలో వైద్య సిబ్బంది ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి చికిత్స అవసరమైన వారికి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదలకు ఇంటి వద్దకే మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సీఎం జగనన్న 'ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 7 రకాల టెస్టులు, 74 రకాల నాణ్యమైన మందులు ఉచితంగా అందిస్తారని వివరించారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కృష్ణగిరి: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అధికారులు, గ్రామస్తులందరూ భాగస్వాములుగా పని చేయాలని సర్పంచ్‌లు సర్వేశ్వరి, వాణిశ్రీ, అంజినమ్మ, మాదేవమ్మ, గిరిబాబు తదితరులు అన్నారు. మండల పరిధిలోని అమకతాడు, పోతుగల్లు తదితర గ్రామ సచివాలయాల్లో సోమవారం ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల్లో విద్య, వైద్యం, నీరు, చెట్ల పెంపకం సమృద్ధిగా ఉన్నప్పుడే అభివృద్ధిలోకి వస్తాయన్నారు. అధికారుల సూచనలను గ్రామస్తులు పాటించాలని కోరారు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామంలోనే అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. సమస్యలున్న వారు సచివాలయానికి వచ్చి తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### 45 మందికి కుట్టుమిషన్ల పంపిణీ



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.మురళీధర్‌రెడ్డి

పత్తికొండ రూరల్: సేవాదళ్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 45 మంది మహిళలకు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డి సోమవారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ముందుగా ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి నాలుగు స్తంభాల కూడలిలో జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపంలో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 400 మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని స్వశక్తితో జీవించాలన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఈర్లదిన్నె రమేష్, ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, మహిళా సంఘం అధ్యక్షురాలు మమత తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మద్దికెర: ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచాలని దేవాలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ సిబ్బందికి సూచించారు. సోమవారం పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి దేవాలయం, పక్కనే వున్న ఆలయాలలో కమిటీ సభ్యులతో పాటు, అర్చకులు సైతం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. చెత్తను వూడ్చి, కాలువలు శుభ్రం చేసి, పిచ్చి మొక్కలు తొలగించారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా వుంటారన్నారు. చెత్త పట్ల నిర్లక్ష్యం చేయరాదన్నారు. సభ్యులు లక్ష్మిరెడ్డి, అర్చకులు రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి

హొళగుంద: గ్రామంలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆధ్వర్యంలో వార్డు మెంబర్లతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో తాగునీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల వ్యవస్థ ఇతర సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### బన్ని ఉత్సవం ప్రశాంతంగా జరుపుకోండి

హొళగుంద: ఈ నెల 24న జరిగే దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హొళగుంద ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం రాత్రి నెరణికి గ్రామంలో బన్ని ఉత్సవం నిర్వహణపై స్థానిక ప్రజలకు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ అందరూ కలిసిమెలిసి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. కక్షలు, కర్పణ్యాలకు వెళ్లకుండా భక్తి శ్రద్ధలతో పండుగ చేసుకోవాలని సూచించారు. రింగు కర్రలు, నాటుసారాకు స్వస్తి పలకాలన్నారు. నేరాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై 100కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని గ్రామస్తులకు సూచించారు.

### భవనం పైనుంచి కిందపడి వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన రాజేష్

రాజంపేట: పట్టణంలోని మన్నూరు తోట కల్యాణ మండపం సమీపంలో నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల భవనంపై నుంచి సోమవారం ఓ యువకుడు కింద పడి దుర్మరణం చెందాడు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం ఆర్.మండగిరికి చెందిన మద్దగిరి రాజేష్ (31) ఇక్కడికి వలస కూలీగా వచ్చి పనులు చేసుకునేవాడు. సోమవారం పని చేస్తుండగా భవనంపై నుంచి కింద పడి మృతి చెందాడు. మృతుడి భార్య ఆరు నెలల గర్భవతి. అలాగే వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. మృతదేహాన్ని రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఈ వ్యవహారం మన్నూరు పోలీసుస్టేషన్‌కు చేరింది. కేసు నమోదు విషయంలో తర్జనభర్జనలు కొనసాగుతున్నాయని బాధిత వర్గాలు పేర్కొన్నాయి.

### అప్పుల బాధతో ఆత్మహత్య



మాదిగ యంకన్న (ఫైల్)

దేవనకొండ: మండలంలోని ఐరన్‌బండ బి.సెంటర్ గ్రామానికి చెందిన రైతు మాదిగ యంకన్న (39) అప్పుల బాధ తాళలేక సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. యంకన్నకు మూడున్నర ఎకరాల పొలం ఉంది. ఆ భూమిలో ఏటా వివిధ రకాల పంటలను సాగు చేస్తూ పంటల పెట్టుబడులకు అప్పులు చేశాడు. అప్పులు ఎక్కువై రూ.4 లక్షలకు చేరాయి. వాటిని ఎలా తీర్చాలో తెలియక రోజూ మదనపడేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ స్థితిలో అప్పుల బాధతో ఫీల్డన్ గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. మృతుడికి గొనెగొండ్ల మండలం నేరెడుప్పల పంచాయతీలో పొలం ఉంది. ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్ రెడ్డి

ఆలూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా జేసీఎస్ కో-ఆర్డినేటర్ తెర్నెకల్ సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం ఆలూరులో ప్రభుత్వ పథకాలు, వాటి వినియోగం, ప్రజాప్రతినిధులు పనితీరు, మండల, వార్డు జేసీఎస్ ఇన్‌చార్జ్‌ల పనితీరుపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతో చర్చించారు. అనంతరం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో మాట్లాడుతూ.. గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లీనిక్‌లు నెలకొల్పుతున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందుతున్నారన్నారు. గత టీడీపీ పాలనలో అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిధులు దోచుకున్నారని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ప్రతి గ్రామ, మండల స్థాయిలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు శేషాద్రిరెడ్డి, రాఘవేంద్ర, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఈరన్న, అశోక్‌రెడ్డి, పులి, రవి, శశి, బసవ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పనులు చేస్తూ మృత్యువాత



రైతు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పెద్దహుల్తి గ్రామానికి చెందిన సంజీవరెడ్డి (42) అనే రైతు సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. పొలం పనుల కోసం వెళ్లిన రైతు అక్కడే కుప్పకూలిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించేలోగానే మృతి చెందాడు. మృతుడికి భార్య పుష్పలత, కుమారులు ఉమేష్‌చంద్రారెడ్డి, గంగాధర్‌రెడ్డి సంతానం ఉన్నారు. పొలానికి వెళ్లిన వ్యక్తి అకస్మాత్తుగా మృత్యువాత పడడంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు.

### చెట్లను సంరక్షించాలి

మద్దికెర: జీవకోటికి ప్రాణవాయువు అందిస్తున్న చెట్లను సంరక్షించుకోవాలని ప్రధానోపాధ్యాయులు దేవేంద్రప్ప పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ మొక్కలు నాటడమే గాకుండా వాటిని సంరక్షించుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నాగరాజు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

### నేడు సురక్ష వైద్య శిబిరాలు

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ రఘురామిరెడ్డి సోమవారం తెలిపారు. శిబిరంలో అన్ని రకాల రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందేస్తామని చెప్పారు. అలాగే 4వ తేదీన బిల్లేకల్లు, 5న ములుగుందం-2, 6న శంకరబండ, 7న చిగిళి-2, 10న ముత్తుకూరు, 11న నగరూరు, 12న చిగిళి-1, 13న బనవనూరు, 17న కైరుప్పల, 18న హలిగేర, 19న కారుమంచి, 20న తంగరడోణ, 21న జొహరాపురం, 26న డీ.కోటకొండ, 27న చిన్నహోతూరు, 28న యాటకల్లు గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తుగ్గలి : మండల పరిధిలోని రాతన గ్రామంలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. గ్రామంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు చేపట్టిన ఇంటింటి ఆరోగ్య సర్వే పూర్తయ్యిందన్నారు. టోకెన్లు తీసుకున్న వారంతా శిబిరానికి హాజరై వైద్య సేవలు పొందాలని సూచించారు.

మద్దికెర: మండలపరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో మంగళవారం స్థానిక పాత పంచాయతీ భవనంలో వైద్య శిబిరం నిర్వహించన్నట్లు ప్రభుత్వ వైద్యాధికారి నగేష్ సోమవారం తెలిపారు. శిబిరంలో 9 రకాలు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలుసద్వినియోగం చేసుకోవాలన్నారు.

కృష్ణగిరి: కంబాలపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వమోహన్, వైద్యాధికారి ప్రదీప్ ఓ ప్రకటనలో తెలియజేశారు

వెల్దుర్తి: మండల పరిధిలోని గోవర్ధనగిరిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శివరాముడు తెలిపారు. గోవర్ధనగిరి-1 సచివాలయం, హెల్త్ క్లినిక్ పరిధిలోని ప్రజలు గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో జరిగే ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు జయరాముడు, వైద్యాధికారులు నవీన్‌కుమార్, శ్రీధర్ రెడ్డి సోమవారం హైస్కూల్‌ను పరిశీలించి క్యాంపు నిర్వహణకు తగు చర్యలు తీసుకున్నారు.

### బళ్లారికి వెళ్లి పింఛన్ పంపిణీ



బళ్లారికి వెళ్లి కాపు సుబ్బమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నాగేంద్ర

నందవరం: గురజాల గ్రామానికి చెందిన కాపు సుబ్బమ్మ వారం రోజుల క్రితం కాలికి ఆపరేషన్ చేయించుకునేందుకు బళ్లారిలో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లింది. ఆమె పింఛన్ తీసుకునేందుకు రాలేని పరిస్థితి ఉండడంతో విషయం తెలుసుకున్న వలంటీర్ నాగేంద్ర సోమవారం బళ్లారికి వెళ్లి పింఛన్ అందజేశాడు. తాము ఉన్న చోటుకే వచ్చి పింఛన్ అందజేయడంతో వృద్ధురాలు సంతోషం వ్యక్తం చేస్తూ వలంటీర్ నాగేంద్రకు, ఆ వ్యవస్థను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపింది.

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక పింఛన్లను సోమవారం రెండవ రోజు వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. ఈనెల 5వ తేదీ వరకు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని, వంద శాతం పంపిణీ పూర్తి చేస్తామని ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు.

### భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

పత్తికొండ రూరల్: చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం భక్తాదులు అమ్మవారి గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. పలువురు భక్తాదులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపించారు. అమ్మవారి వేషధారణలతో సాగిన ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాళికామాత రాక్షస వధ నృత్య ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది.

### బాడీ ఫ్రీజర్ విరాళం

మద్దికెర: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో 1995-96 లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం రూ.92 వేలు విలువ చేసే బాడీ ఫ్రీజర్ (మృతదేహాన్ని ఉంచే పెట్టె) ను మద్దికెర పంచాయతీ కార్యాలయానికి ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి ఆధ్వర్యంలో విరాళంగా అందజేశారు. మేజర్ పంచాయతీలో ప్రజలు అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడకుండా ఫ్రీజర్ బాక్స్ అందజేయడం జరిగిందన్నారు.